నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

యువతకు శిక్షణతో పాటు జీవనోపాధి కల్పించేందుకు ఆసక్తి కలిగిన యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ పేర్కొన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎస్.భాస్కర్ అధ్యక్షతన యువతీ యువకులకు ఇష్టమైన చేతి వృత్తుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన హోమ్ ట్రయాంగిల్ ద్వారా కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, ఎసి మెకానిక్, ఫ్రిడ్జ్ మెకానిక్, వాషింగ్ మిషన్, టివి, ప్యూరిఫైయర్ మెకానిక్, బ్యూటీషియన్ ప్రొఫైల్ తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు రిజిస్ట్రేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లో సర్వీస్ ప్రొవైడర్ కోసం పేర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిఒ రాజేశ్వరి, ఆర్‌పిలు పాల్గొన్నారు.

మండలి పోరులో నిలిచేదెవరు?

- పట్టభద్రుల స్థానానికి పెరుగుతున్న పోటీ
- పిడిఎఫ్ అభ్యర్థిగా రాఘవులు ఖరారు
- రసవత్తరంగా మారనున్న ఎన్నికలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ విడుదల కాబోతుంది. పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ ఖాయంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో పలువురు ఆశావహులు బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సాధారణ ఎన్నికల తర్వాత జరగబోతున్న మండలి పోరులో నిలిచేదెవరు? అన్న దానిపై ఆసక్తి కనిపిస్తుంది. ఇప్పటికే పిడిఎఫ్ తరపున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెఎసి కన్వీనర్ డి.వి.రాఘవులు పేరు ఖరారైంది. పిడిఎఫ్ తరపున ఆయన పోటీలో నిలుస్తున్నారు. ఆయనతో పాటుగా కూటమి బలపర్చిన టిడిపి నేత పేరాబత్తుల రాజశేఖరం కూడా బరిలో ఉన్నారు. అలాగే కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన మరికొందరు బరిలోకి దిగే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రసవత్తరంగా మారబోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గత డిసెంబర్ 30న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి విడుదల చేశారు. మొత్తం 3,15,261 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4664, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమలో 64,327, తూర్పుగోదావరిలో 63,441 మంది, ఏలూరు జిల్లాలో 42,602, కాకినాడ జిల్లాలో 70,343, పశ్చిమగోదావరి జిల్లాలో 69,884 మంది ఓటర్లున్నారు. ఆరు జిల్లాల్లోనూ 440 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 29 నాటికి ప్రస్తుత ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పదవి కాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి రెండవ వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉంది. అలాగే మార్చి 2వ వారంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగొచ్చు. మార్చి 29 లోపే మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగిసే అవకాశం ఉంది.

పిడిఎఫ్‌దే హవా...

శాసన మండలి పునరుద్ధరణ తర్వాత తొలిసారిగా 2007లో జరిగిన ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున బరిలోకి దిగిన కచ్చా జార్జివిక్టర్ అనూహ్య విజయం సాధించారు. పట్టభద్రుల స్థానంలో నిలిచిన ఆయన విజయం ఓటర్ల విజ్ఞతకు నిదర్శనంగా అందరూ పేర్కొన్నారు. నిజాయితీగా ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ప్రజల పక్షాన నిలిచిన ఎంఎల్‌సిగాగా విక్టర్ గుర్తింపు పొందారు. జిల్లాలోని ప్రజా సమస్యల్ని, పట్టభద్రుల సమస్యలను శాసనమండలి వేదికగా వినిపించేందుకు ఆయన ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో కార్పొరేట్ విద్యాసంస్థల అధినేతగా ఉన్న కె.రవికిరణ్‌వర్మ గెలుపొందారు. అయితే పట్టభద్రుల సమస్యల విషయంలో చొరవ చూపలేకపోయారనే అభిప్రాయం ఆయనపై సర్వత్రా ఏర్పడింది. ఆ తర్వాత 2019లో పట్టభద్రుల స్థానం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రతినిధి అయిన ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) బరిలోకి దిగి భారీ విజయాన్ని సాధించారు. ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందారు. పట్టభద్రులంతా ఆయన వైపు నిలబడడంతో ఐవి గడచిన కాలంలో అనేక ఉద్యమాలు చేశారు. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగ సమస్యలపై శాసన మండలిలో గళమెత్తారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేయాలని జరిగిన పోరాటాలలో ముందు నిలబడ్డారు. ప్రభుత్వాన్ని నిలదీశారు. సిపిఎస్ రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని నినదించారు. కారుణ్య నియామకాల చేపట్టాలని అనేకసార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాడారు. అంతేకాకుండా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక సమావేశాల్లో మాట్లాడి వాటి పరిష్కారం దిశగా చొరవ చూపారు. ఈ నేపథ్యంలో రాబోవు పట్టభద్రుల ఎన్నికల పట్ల పలువురు ఆసక్తి చూపుతున్నారు.

40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో...



తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా దిడ్ల వీరరాఘవులను ప్రకటించారు. పిడిఎఫ్ తరపున బరిలోకి దిగుతున్న ఈయన 40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. 1984 నుంచి 2024 వరకు టీచరుగా పనిచేశారు. 35 ఏళ్ల పాటు ఉపాధ్యాయ ఉద్యమకారుడుగా పనిచేశారు. పదేళ్లపాటు మండల కార్యదర్శిగా, 12 సంవత్సరాలు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, ఐదేళ్ల అధ్యక్షునిగా, రెండు సంవత్సరాలు రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గా, మరో రెండేళ్ల రాష్ట్ర కార్యదర్శిగా, మూడేళ్ల పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ గా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన ఉమ్మడి జిల్లా జేఏసీ కన్వీనర్ గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపక సంఘాల మద్దతు దండీగా ఉండడంతో ఆయన గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

కలెక్టరేట్ వద్ద యానిమేటర్ల ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

8 నెలలుగా బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ వెలుగు యానిమేటర్ల యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో వెలుగు యానిమేటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.జ్యోతి అధ్యక్షతన చేపట్టిన ఈ ధర్నాల్లో సిఐటియు జిల్లా కోశాధికారి కృష్ణవేణి మాట్లాడారు. 8 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ప్రతి నెలా వేతనాలు యానిమేటర్లకు చెల్లించకపోవడం అన్యాయమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్న యానిమేటర్లను అనేక చోట్ల రాజకీయ వేధింపులతో తొలగిస్తున్నారని తెలిపారు. 25 సంవత్సరాల నుంచి యానిమేటర్ వృత్తి మీద ఆధారపడి కుటుంబాలు జీవిస్తుంటే ఉన్నట్టుండి వాళ్ళని తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సుబ్బలక్ష్మి, వేణు, విజయ, మీరా, శ్యామల, సంతోషి, రత్నకుమారి, వెంకటరమణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల వినతి

ప్రజాశక్తి-అమలాపురం

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కోశాధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి వినతిపత్రం అందించారు. అనంతరం కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లాలో అనేక పిహెచ్‌సిల్లో ఆశ వర్కర్లకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్తేర్ రాణి మాట్లాడుతూ కుందూరు పిహెసిలో ఆశ వర్కర్స్‌ను ఎఎన్ఎంలు వేధింపులకు గురి చేయడం వల్ల ఇద్దరు స్పృహ తప్పి పడిపోయారని, వెంటనే వారిని ఆసుపత్రిలో చేర్పించారని తెలిపారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సీతారత్నం మాట్లాడుతూ ఆన్‌లైన్ పని భారం తీవ్రంగా పెరిగిందని, అనారోగ్యాలతో అనేకమంది చనిపోతున్నారని సర్వీస్‌లో ఉండి చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఈశ్వరి, భువనేశ్వరి పాల్గొన్నారు.



డిఎంఅండ్ హెచ్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న ఆశ వర్కర్లు

పంట కాలువల ఆధునికీకరణ ప్రారంభం

ప్రజాశక్తి-రామచంద్రపురం

దాళ్వా వరి పంటకు అవసరమైన సాగునీరు అందించేందుకు పంట కాలువల ఆధునీకీకరణ పనులను సోమవారం ప్రారంభించారు. పంట కాలువలలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు తూటికాడ, గుర్రపుడెక్క పెరిగిపోవడంతో సాగునీరు సక్రమంగా అందడం లేదు. దీంతో పంట పొలాల రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. గత రెండు మూడు ఏళ్లుగా పంట కాలవలను ఆధునికీకరించకపోవడంతో సాగునీటి ప్రవాహం అంతంత మాత్రమే ఉంటుంది. దీనిని పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు కాలువల పూడిక తీతకు అనుమతులు తీసుకుని అవసరమైన నిధులు మంజూరు కావడంతో మండలంలోని ఇంజరం కెనాల్ ను ఆధునీకరణ పనులు ప్రారంభించారు. ఈ మేరకు వెంకటాయపాలెం కాలువ నుండి పనులు ప్రారంభమయ్యాయి. కాలువల పూడిక తీతతో శివారు ప్రాంతాలైన దుగ్గుదూరు, ఉప్పుమిల్లి, దంగేరు, పేకేరు, శివల, గుడిగళ్ల గ్రామాలలోని రైతులకు ఉపయోగపడుతుంది. ఇంజరం కాలువ ఆధునీకీకరణ పనులను రూ.7 లక్షలతో చేపట్టామని ఇరిగేషన్ ఎఇ వి.సుజాత తెలిపారు. రైతులకు ఈ పనులు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.



వేగాయమ్మపేట వద్ద కెనాల్ ఆధునికీకరణ పనులు



వినతిపత్రం అందిస్తున్న కుమార్ రాజా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకత్వం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యల మీద దృష్టి పెట్టి పనిచేయాలని సమస్యలు పరిష్కరించాలని కోరారు. వారి సమస్యలపై పీడీ సానుకూలంగా స్పందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వెంకటలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, పి.రత్నకుమారి పాల్గొన్నారు.



ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో సిఐటియు నాయకులు

పాఠశాల విలీన ప్రక్రియను నిలిపి వేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక ఎస్‌సి కాలనీ లోని చర్చి వీధి ఎంపిపి పాఠశాలను గ్రామం మధ్యలోని పాఠశాలలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలలో 42 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ పాఠశాలను విలీనం చేయబోయే పాఠశాలకు వీరు చేరుకోవాలంటే మధ్యలో జొన్నాడ, మండపేట ఆర్ అండ్ బి ప్రధాన రహదారిని దాటాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల విద్యార్థులు ప్రమాదాలకు లోనయ్యే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలమూరులోని కండ్రిగలో ఉన్న పాఠశాల, శెట్టిబలిజ రామాలయం సమీపంలో ఉన్న పాఠశాల అతి సమీపంలో ఉన్నాయి. ఎక్కడో దూరంగా ఉన్న కాలనీలోని పాఠశాలను ఈ విలీన ప్రక్రియలో భాగస్వామ్యం చేయడంపై ఇప్పటికే స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. మండల విద్యాశాఖ అధికారులకు సమస్య తెలియపరచి చర్యలు తీసుకుంటామని తాహసిల్దార్ ప్రకాష్ బాబు అన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-అమలాపురం

ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం ఇంటర్మీడియట్ బోర్డు ఎగ్జామినేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జెసి నిషాంతి మాట్లాడారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను అధికారులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎటువంటి పేపర్ లీకేజీలూ, మాల్ ప్రాక్టీస్‌లకు తావు లేకుండా నిర్వహించాలన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్, థియరీ నిష్పక్షపాతంగా, శాంతియుతంగా క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మూడు దశల్లో నిర్వహిస్తారన్నారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి 20వ తారీకు వరకు, ఒకేషనల్ ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 5 నుండి 20వ తారీకు వరకు రెండు సెషన్స్‌లో ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు కంట్రోల్ రూమ్, హైపవర్ కమిటీ జిల్లా స్ట్రాంగ్ రూమ్, జిల్లా రిసెప్షన్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్టోరేజ్ పాయింట్ బందోబస్తు ఏర్పాట్లు, స్పాట్ వాల్యూషన్ క్యాంపులు, శాంతిభద్రతల పరిరక్షణకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పరీక్షా కేంద్రాల చుట్టు పక్కల జిరాక్స్ సెంటర్ల మూసివేత, సున్నితమైన పరీక్షా కేంద్రాలు ఉన్నచోట అదనపు బందోబస్తు వంటి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ రాజకుమారి, ఇంటర్ బోర్డు కన్వీనర్ వి.సోమశేఖర రావు, కమిటీ సభ్యులు డిఎంహెచ్‌ఒ దుర్గారావు దొర, ఆర్‌టిసి మేనేజర్ శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఇఇ రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

సత్వరం ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

సుపరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కార కోసం క్షేత్రస్థాయి అధికారులతో నిరంతర సమన్వయం అవసరమన్నారు. అర్జీ అందిన వెంటనే క్షుణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొంటూ నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. పిజిఆర్ఎస్ అర్జీలతోపాటు స్వర్ణాంధ్ర విజన్, రెవెన్యూ సమస్యల నైపుణ్యాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్య పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందు నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డిఆర్‌ఒ రాజకుమారి, డిఆర్‌డిఎ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.త్రినాథరావు, కృష్ణమూర్తి, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - అల్లవరం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

డి.రావులపాలెంలో సూర్య బిల్డింగ్‌లో గ్రామ సర్పంచ్ ఉండ్రు భగవాన్ దాస్ అధ్యక్షత సోమవారం పశు ఆరోగ్య శిబిరం, లేగ దూడల ప్రదర్శనను అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు సోమవారం ప్రారంభించారు. ఈ సంద్భంగా ఆనందరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రాష్ట్రంలోని పశు పోషకులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, పశు వ్యాధులను నియంత్రించడానికి, పశు పోషణ ఖర్చులు తగ్గించడానికి, ఆర్థికంగా భరోసా కలగచేయడానికి పశు సంవర్థక శాఖ ద్వారా అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేగ దూడల ప్రదర్శనలో ఉత్తమమైన వాటికి బహుమతులు అందించారు. పశువులకు టీకాలు, నట్టల నివారణ మందులు, చూడి పరీక్షలు, గర్భకోశ సమస్యలు, పేడ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్క్రమంలో ఎంపిపి ఇళ్ల శేషగిరి రావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కొమ్మా వెంకటరావు, సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ లక్ష్మణరావు, అల్లవరం మండల పశువైద్యాధికారి డాక్టర్ మేడిద నారాయణరావు, డాక్టర్ శివతేజ, ఇన్‌ఛార్జి పంచాయతీ సెక్రెటరీ పి.సాయిబాబు, ఎంపిటిసి తిక్కా శేషుబాబు, ఎహెచ్ఎ కటికిరెడ్డి శివనాగేంద్ర, కూటమి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.


ఈరన్న హంతకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-అమలాపురం

కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికెరలో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, కార్యదర్శి నూకల బలరాం మాట్లాడారు. పట్టపగలు ఈరన్నపై వేట కొడవలితో దాడి చేసి హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దుండగులను వెంటనే పట్టుకోవాలని కఠినంగా శిక్షించాలని, ఈరన్న కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లపై రాజకీయ వేధింపులు ఆరికట్టాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, శ్రీనివాస్, మద్దా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్టూ'నిజం'



రెవెన్యూ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం రాష్ట్ర బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం, వర్కింగ్ కమిటీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుత్తుల వీర బ్రహ్మం ఆధ్వర్యంలో తహశీల్దారు పి.చిన్నారావు, బిసి ఉద్యోగులు, 2025 బిసి ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కణను ఘనంగా నిర్వహించారు. అనంతరం 76వ గణతంత్ర వేడుకల్లో ఉత్తమ అవార్డు తహశీల్దారుగా ప్రశంసా పత్రం అందుకున్న తహసిల్దార్ పి.చిన్నారావును, వాకతిప్ప గ్రామ విఆర్‌ఒ జి ఉమామహేశ్వరరావును ఉద్యోగ సంఘం నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

వన్నె చింతలపూడి హైస్కూల్‌కు బహుమతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

దక్షిణ భారతదేశ స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్టీపర్పస్ సైక్లింగ్ మిల్ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ నెల 21 నుండి 25 వరకు పుదుచ్చేరిలో దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. నిత్య జీవితంలో ఈ మిషన్ ద్వారా వ్యాయామే కాక ఏకకాలంలో పిండి జల్లించడం, ఇసుక జల్లించడం, బియ్యం, పప్పులు శుభ్రపరచడం, అల్లం, వెల్లుల్లి, గోరింటాకును గ్రైండింగ్ చేయడం, విద్యుత్ ఉత్పాదనకు యంత్రాన్ని రూపొందించారు. బహుమతి అందుకుని పాఠశాలకు వచ్చిన విజేతలను అభినందిస్తూ సోమవారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పి.రోహిణి, ఎస్.శశివదన, గైడ్ టీచర్లు పి. శ్రీప్రకాష్, జి.నాగ సత్యనారాయణను ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, జెడ్పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, ఎంపిపి కుడుపూడి భాగ్యలక్ష్మి బాబు, సర్పంచ్ నక్కా రాజారత్న, రాజవాణి కృష్ణ, పరమట శ్యామ్, డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా, డివైఇఒ జి.సూర్య ప్రకాశం, డిఎస్ఒ జివివి.సుబ్రహ్మణ్యం, సిఎంఒ బివి. సుబ్రహ్మణ్యం, ఎఎం ఒ రాంబాబు, ఎంఎకె.భీమారావు, ఎస్ఎంసి చైర్మన్ ఎలిపే ముత్యాల బాబు, ఎస్ఎంసి సభ్యులు, స్థానిక ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ శ్రీమన్నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు



నగదు ప్రోత్సాహం అందిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

విద్యార్థులకు అండగా ఉద్యోగులు

ప్రజాశక్తి-మామిడికుదురు

ప్రతిభావంతులైన బిసి విద్యార్థులకు ఉద్యోగులు అండగా నిలవడం అభినందనీయమని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురులో బిసి కమ్యూనిటీ హాల్లో బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం 28వ వార్షికోత్సవం మండల శాఖ అధ్యక్షుడు నయనాల రఘురామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభావంతులైన బిసి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీ కృష్ణ, బొక్కా వెంకటేశ్వరరావు, గుబ్బల సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యనారాయణ

సిహెచ్‌సి అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - పి.గన్నవరం

సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ నూతన కార్యవర్గానికి సూచించారు. పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా నియమితులైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోట రాజేంద్రప్రసాద్, గుడాల సంపదరావు, పితాని నాగమణి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎంఎల్ఎ హాజరై సభ్యులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, డొక్కా నాగబాబు, పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి, ఇరిగేషన్ స్టేట్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, టిడిపి కో కన్వీనర్ డివివి.సత్యనారాయణ, అరిగెల సూరిబాబు, ఎం.రామకృష్ణ, జనసేన వీర మహిళ శిరి, సంసాని పెద్దిరాజు, ఎంపిడిఒ కెవి.ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మెడికల్ షాపులో రూ.2 లక్షల చోరీ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడు గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లో ఉన్న సతీష్ మెడికల్ అండ్ జనరల్ షాపు తాళాలు పగలుగొట్టి రూ.2 లక్షల నగదును గుర్తి తెలియని వ్యక్తులు దొంగిలించుకు పోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని దుళ్ల గ్రామానికి చెందిన గుంటూరి సతీష్ జేగురుపాడులో కొన్నేళ్లుగా మెడికల్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఒక వ్యక్తికి రూ.2లక్షల నగదు ఇవ్వాల్సి ఉండటంతో ఆ మొత్తాన్ని షాపులోనే ఉంచాడు. రాత్రి షాపు కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వచ్చి చూసేసరికి షాపు తాళాలు పగలు గొట్టి ఉండటాన్ని గమనించాడు. వెంటనే లోపలికి వెళ్ల చూడగా రూ.2లక్షలు మాయమైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. కడియం క్రైం హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించింది. దగ్గరలోని మరో షాపులోనూ చోరీకి విఫలయత్నం చేసినట్టు గుర్తించారు. సమీపంలోని ఒక పశువుల షెడ్డు వద్ద ఉన్న సిసి కెమెరాలను సైతం దుండగులు పగులగొట్టినట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసును నమోదు చేశారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ జి.చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. గత శుక్రవారం బిళ్ళనందూరు గ్రామానికి చెందిన మాతిరెడ్డి గంగయ్యమ్మ ఉపాధి కూలీ పనికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి ఇంటి తలుపులు పగలకొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూస్తే బీరువా పగిలిపోయి ఉంది. బీరువాలో దాచిన 100 గ్రాముల బంగారు ఆభరణలో చోరీకి గురియైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సోమవారం తాటిపాక సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అదే గ్రామానికి చెందిన బొత్స వీరబాబు వద్ద బంగారు ఆభరణాలు లభించాయి. అదే గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు మిరియాల నాగు, మిరియాల నానాజీ మధ్య జరిగిన చిన్నపాటి వివాదంలో జరిగింది. దీంతో తమ్ముడు నానాజీని కర్రతో దాడి చేశాడు. ఈ కేసులో మిరియాల నాగును అరెస్టు చేసినట్లు వారు తెలిపారు.

చిక్కం సత్యవరప్రసాదరావు మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం చిక్కం సత్తిరాజు అన్నదాన సత్రం అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, గొల్లవిల్లి సిఎస్ఎం జూనియర్ ఎంఎస్ఎస్ డిగ్రీ కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిక్కం వీర వెంకట సత్య వర ప్రసాదరావు (64) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వరప్రసాదరావు భౌతికకాయాన్ని సోమవారం కళాశాలల ప్రాంగణంలో ఉంచి కళాశాలల కార్యవర్గ సభ్యులు పాలకవర్గ సభ్యులు విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రసాదరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. కళాశాలల ప్రిన్సిపల్ కంచుమర్తి బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ తోకల దుర్గా ఈశ్వరరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సంతాపం తెలిపారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

కొత్త కాలనీ రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయతీ పాపాయి చెరువు కొత్త కాలనీలో రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు 15 ఏళ్ల క్రితం కొత్త కాలనీ ఏర్పాటయ్యింది. అప్పటినుంచి కాలనీలోకి వెళ్లేందుకు సరైన రోడ్డు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్థానిక సర్పంచ్ సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు చొరవ చూపి పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5లక్షలతో మెటల్ రోడ్డు మంజూరు చేశారు. ఈ క్రమంలో సోమవారం రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ చిన్నవరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పండు సత్యనారాయణమూర్తి, కుంచే మోహన్, నడింపల్లి సుబ్బరాజు, కుంచే రాజేష్, పోతుమూడి కొండబాబు, పండు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎం ఉపాధ్యక్షునిగా నాయుడు

ప్రజాశక్తి-అమలాపురం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ ప్రయివేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాల జనరల్ బాడీ ఉపాధ్యక్షునిగా పట్టణానికి చెందిన విద్యానిధి డిగ్రీ కళాశాల చైర్మన్ ఆకుల బాపన్న నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ ప్రయివేట్ అనుబంధ కళాశాలల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆదిత్య శేషారెడ్డి, గంధం నారాయణ రావు, ప్రగతి రాజా, మోడ్రన్ జి.వి.రావు, విద్యానిధి కళాశాలల ప్రిన్సిపల్స్ సుధీర్ బాబు, సుబ్బారెడ్డి తదితరులు నాయుడును అభినందించారు.

భవనానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం గణపవరం మండలం అర్ధవరం గ్రామానికి చెందిన అడ్డాడవెంకటనాగరాజు సురేఖ దంపతులు రూ.1.116 లక్షలలను ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరావుకు అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఆదర్శంగా ముదునూరి ట్రస్ట్ సేవలు

సొంత డబ్బులతో లతేంద్రవర్మ దాతృత్వం

ప్రజాశక్తి-రాజోలు

సమాజ సేవే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు రాజోలు మండలానికి చెందిన ముదునూరి లతేంద్ర వర్మ. తన తండ్రి పేరుతో చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి.. పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ఐదేళ్ళ గా పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ పలువురి ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటున్నారు. తన తండ్రి పేరును శాశ్వతంగా నిలబెట్టేందుకు ఆయన పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.


రాజోలుకు చెందిన ముదునూరి అక్కి రాజు అంటే ఉభయగోదావరి జిల్లాలో తెలియని వారు ఉండకపోవచ్చు అక్కిరాజు అనేకమంది విద్యార్థినీ విద్యార్థులకు ఫీజులు కడుతూ అనేక సహాయ సహకారాలు అందించే వారు. ఆయన పేరున పెద్ద కుమారుడు ముదునూరి లతేంద్ర వర్మ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేసు న్నారు.కరోనా సమయంలో ట్రస్ట్ సేవలతో అనేకమంది ప్రాణాలు దక్కించుకున్నారు. కరోనా సమయంలో రూ.లక్షలు వెచ్చించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన చేసిన సేవలకు ఢిల్లీలోని అత్యంత ప్రతిష్టాత్మక ఆదిలీల ఫౌండేషన్ సంస్థ అనేక అవార్డులు ఇచ్చి సత్కరించారు.. ఇటీవల ప్రభుత్వ హాస్టల్లోని పిల్లలు శీతాకాలంలో చలికి ఇబ్బందులు పడుతున్నారని రూ.లక్షలు ఖర్చు చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. రాజోలు ఎస్‌సి బాలికల హాస్టల్లో గదులు, మరుగుదొడ్లు, గోడలు హాలు అన్నింటిని బాగు చేశారను. సుమారు రూ.11 లక్షలతో హాస్టల్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. ఈ పనులను ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ప్రారంభించనున్నారు.




ప్రజా సేవలతోనే సంతృప్తి

డబ్బు ఎంత సంపాదించినా.. ప్రజలకు సేవ చేయడంలోనే ఆత్మ సంతప్తి ఉంది. అందువల్లే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాను. సంపాదించిన దానిలో అవసరార్థులకు చేయూత అందించడంలో కలిగే అనుభూతి వేరు. రాజకీయాలకు సంబంధం లేకుండా నా తండ్రి పేరుతో చివరి వరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటా. నిరుపేదలకు సేవ చేయడమే సంతప్తి కలిగించింది. కరోనా కష్టకాలంలో వారికి అండగా నిలవడంతో నా జీవితానికి సార్థకత దక్కింది. మరలా రాజోలు బాలికల హస్టల్ ఆధునీకరణ పనులు చేయడం సతప్తి ని ఇచ్చింది.

ముదునూరి లతేంద్ర వర్మ
శ్రీ ముదునూరి అక్కిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు.





కలెక్టర్ మహేష్‌కుమార్, మంత్రి సుభాష్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న లతేంద్ర వర్మ

సమస్యలపై కెయిర్న్‌కు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్.యానాం గ్రామంలో సమస్యలను తక్షణం పరిష్కరించాలని చమురు సంస్థ రవ్వ ప్లాంట్ యాజమాన్యమైన కెయిర్న్ వేదాంత అధికారులకు సోమవారం ఆ గ్రామ పెద్దలు వినతిపత్రం అందజేశారు. పిహెచ్‌సిలో మందుల కొరత ఉందని, అంబులెన్స్ మరమ్మతులకు గురైందని, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వేదాంత అధికారులు సతీష్ రెడ్డి, సోమన్ దేవ్‌కు విన్నవించారు. గ్రామంలో అర్హత ఉన్న నిరుద్యోగులకు తక్షణం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సిలో పూర్తిస్థాయిలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, అమలాపురం ఎర్ర వంతెన నుండి ఆర్ అండ్ బి ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో అభివద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెట్టా అప్పారావు, గ్రామ పెద్దలు పలచోళ్ల పద్మనాభం, లంకే భీమరాజు, పినిశెట్టి నరసింహారావు, అయితాబత్తుల రాజశేఖర్, ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ల బుజ్జి, జోగి రాజా, మేకల నానాజీ, చీకట్ల శ్రీనివాసరావు, ఉండ్రు సామ్యేల్, అయితాబత్తుల మీరాకుమార్, మన్నే వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ యువగళం సంబరాలు

గత వైసిపి పాలలో టిడిపి యువనేత నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పలుచోట్ల వేడుకలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజోలు టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బోళ్ల వెంకటరమణ, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ రాజోలులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. యువగళం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ, చెల్లింగి సత్యనారాయణ, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, కాండ్రేగుల భవాని, అడబాల విజయ్, కడలి వెంకటరమణ, పెచ్చెట్టి జగదీశ్, కాండ్రేగుల పూర్ణ సురేష్, మానుకొండ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రామచంద్రపురం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గరికపాటి సూర్యనారాయణ, కొమరిన వీర్రాజు, కడియాల రాఘవన్, జాస్తి విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వాడపాలెంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల కన్నీళ్లు తుడుస్తూ నాడు కుప్పంలో ప్రారంభించిన యువగళం రథసారథిగా లోకేష్ పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లోకేష్‌కు సత్యానందరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కంశెట్టి చంటి, కోనాల అంబేద్కర్, కడియం చిన్న, కొమ్ము నారాయుడు, కముజు శ్రీను పాల్గొన్నారు.



రాజోలులో టిడిపి నాయకుల వేడుకలు

ఉత్తమ ఎంపిడిఒ వెంకటాచారి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విధి నిర్వహణలో అంకితభావంతో అందించిన సేవలకు ఎంపిడిఒ టిఎస్.వెంకటాచారి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ మహేష్ కుమార్, ఎంపీ హరీష్ మాధుర్ ద్వారా ఆయన ఈ సేవా పురస్కారం అందుకున్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పశువుల ఆసుపత్రి వద్ద సోమవారం ఉచితంగా పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పశువులకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.భాను ప్రసాదరావు, డాక్టర్ కె.తిరుమల రాజా, జెఇలు వి.సూర్య నారాయణమూర్తి, కె.విజయబాబు, ఎల్ఎస్ఒ.రాణి, విఎ పి.భవాని, ఎహెచ్‌లు బి.రాజేష్, జాన్, మండల డిసి అధ్యక్షుడు మెర్ల గోపాల స్వామి, జనసేన నాయకులు సూరపురెడ్డి సత్య, దంగేటి భాపనయ్య, పల్ల శ్రీను, ఆకుల వీర్రాజు, సుంకర ముసలయ్య, ధర్మాసుల శివ రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఇందుపల్లి పరిధిలోని బట్లపాలెంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ చొల్లంగి శివాలిని అప్పాజీ సోమవారం అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతంలో 60 వేల లీటర్ల కెపాసిటీ గల మంచినీటి ట్యాంకును నిర్మించాలని కోరారు. రహదారుల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు. సర్పంచ్ వెంట వార్డు సభ్యులు, శిరగం దొరబాబు, మోటూరి రాంబాబు, వాండ్రసి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి-ఆలమూరు

చింతలూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రీరామ రెపిడిక్స్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్ పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. మాతృభాష మాధ్యమంగా ఆంగ్ల భాషను సులభతరంగా నేర్చుకోవడానికి ఈ పుస్తకాలు అందించినట్టు శ్రీరామ తెలిపారు. ఈ పుస్తకాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉడతా వేంకటేశ్వరరావు, వాసా దుర్గాప్రసాద్ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మార్గాని కరుణ ఏసు, మాజీ జెడ్‌పిటిసి దండంగి మమత, మాజీ ఎంపిపి దండంగి రామారావు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ బి.దుర్గాదేవి, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు, నూకంబిక ఆలయ మాజీ చైర్మన్ వైట్ల శేషుబాబు, దేశాబత్తుల సత్యనారాయణ, మార్గాని యేసు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడలో గొడవర్తి సత్యనారాయణమూర్తి, పద్మ దంపతుల సౌజన్యంతో ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు బండారు సంజీవ్ ముఖ్య అతిథిగా హాజరై దాతలతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఆ గ్రామంలో ఉన్న ఆరు అంగన్‌వాడీ కేంద్రాలకు, దాతలు ఆరు బీరువాలను సమకూర్చగా ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎఎంసి ఉపాధ్యక్షుడు గొడవర్తి బాబి, ఎఎంసి మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

ప్రజాశక్తి - జగ్గంపేట, పెద్దాపురం

జగ్గంపేటలో ఎలక్ట్రీషియన్ డే వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. రావులమ్మ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పేకేటి వెంకటరమణ, తాతారావు ఆధ్వర్యంలో స్థానిక రావులమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి జగ్గంపేట మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. బల్బును కనుగొని వెలిగించిన శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. పెద్దాపురంలో యాసలపు సూర్యారావు భవనంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ అధ్యక్షతన ఎలక్ట్రికల్ డే సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ అధికారి రవికుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘ అధ్యక్షుడు తాడిశెట్టి గంగ సంఘ అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, గడిగట్ట సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రమైన ఆలమూరులో శ్రీశివశక్తి ఎలక్ట్రికల్, ప్లంబింగ్ రివైండింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే సోమవారం నిర్వహించారు. శ్రీమురళీకృష్ణ సంస్థల అధినేత, నియోజవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, కూటమి నాయకులు వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు రామానుజుల శేషయ్య, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండే రామకృష్ణ, వేమగిరి శ్యామ్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాళ్ళ సత్తిబాబు, యూనియన్ అధ్యక్షులు సింగవరపు సత్యవర రామ ప్రసాద్, సెక్రటరీ సూరంపూడి శ్రీరామకృష్ణ, కోశాదికారి ఏడిద సూర్యగోపాలచార్యులు, వైస్ ప్రెసిడెంట్ దిడ్డి రాము, జాయింట్ సెక్రటరీ వస్కా బాలరాజు, జాయింట్ ట్రెజరర్ ఉండమట్ల వెంకన్న, బుంగ శ్రీను, మూరా మణిరాజు, చల్లా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేస్తున్న వ్యవసాయ భూములు అన్నింటికీ సాగునీరు సక్రమంగా అందే విధంగా కాలువల వెంబడి ఆక్రమణలు తొలగించాలని చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం అమలాపురంలోని గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఇరిగేషన్ ఇఇ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కాలువల దుస్థితిని, ఆక్రమణల తీరును అందులో వివరించారు. సాగునీరు సక్రమంగా అందక పోవడం వల్ల రైతులు పడుతున్నా ఇబ్బందులను వివరించారు. ఆక్రమణల గురించి అధికారులు పట్టించుకోకుంటే వరి సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ర్యాలిలో జగన్మోహినీ కేశవ స్వామి ఆలయానికి అన్నదాన నిర్వహించేందుకు సోమవారం హైదరాబాద్‌కు చెందిన దండాల రమేష్ రాధారాణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇఒ భాగవతుల వెంకటరమణమూర్తికి అందజేశారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి శేష వస్త్రం, చిత్రపటం అందజేశారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి -మామిడికుదురు

ప్రతి మండలానికీ ఒక సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని మామిడికుదురు, రాజోలు, పి.గన్నవరం మండలాలకు చెందిన శ్రీ నవదుర్గ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా సోమవారం తాటిపాక సెంటర్ నుంచి పాశర్లపూడి సెంటర్ వరకూ బైకు ర్యాలీ నిర్వహించారు. సంక్షేమ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మెడబల రామారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల జనార్దన్ రావు, ఎం.సత్యనారాయణ, ప్రతినిధులు కట్టా రాంబాబు, చిట్టూరి సురేష్, యాండ్ర నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఫణీంద్రకు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విధి నిర్వహణలో అంకిత భావంతో సేవలందించిన ఎస్.ఫణింద్ర ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. మండల పరిధిలోని లంక ఆఫ్ ఠాణేలంక గ్రామ సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న ఫణింద్రకు 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా ప్రధాన కేంద్రమైన అమలాపురంలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో ఆదివారం గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్‌పి. బి.కృష్ణారావు, ఎంపీ హరీష్ మాధుర్ ద్వారా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

ఓఎన్‌జిసి ఆధ్వర్యాన కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -మామిడికుదురు

ఓఎన్‌జిసి రాజమండ్రి ఆసెట్ ఆధ్వర్యంలో నగరం పంచాయతీ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ జాలెం రమణకుమారి ప్రారంభించారు. అనుగ్రహ దష్టి దాన్ సంస్థ డివైన్ హై ఫౌండేషన్ పరమ హంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన వారిని ఎంపిక చేసి వారికి ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జిసి చీఫ్ ఎచిరు

వ్యాపారులకు అండగా సిఐటియు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వివిధ ప్రాంతాలకు సైకిల్, బైకులపై వెళ్లి వ్యాపారం చేసుకునేవారికి సిఐయుటి అండగా నిలుస్తుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ అన్నారు. సోమవారం మండలంలోని లొల్ల లాకుల వద్ద ఉల్లిపాయలు వ్యాపార వర్తకుల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిరువ్యాపారులు మాట్లాడుతూ కొవ్వూరు, పట్టిసీమ, కానూరులో కొంత మంది వ్యాపారస్తులు తమను ఉల్లిపాయలు అమ్మనివ్వడం లేదని, బెదిరింపులు, దాడులకు దిగుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ఉమ్మడి గోదావరి జిల్లా ఉల్లిపాయ ఆటో సంచార వర్కర్స్ ట్రేడ్ యూనియన్‌గా రిజిస్ట్రేషన్ చెయ్యాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో రామకృష్ణ, కె.అప్పారావు, పి.సూరన్న, పిపి.వినాయకరావు, కె.బన్నీ, కె.సాయి పాల్గొన్నారు